క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన బండ కార్తీక



లాలాపేట: ఇటీవల బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి బుధవారం హైదరాబాద్ లిబరేషన్ డే వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. తనకు పార్టీలో సముచితమైన ప్రాధాన్యత కల్పించినందుకు కార్తీకరెడ్డి కేంద్ర మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

నిబద్ధతతో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



మధుసుధాకర్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ వాణి తదితరులు

గాంధీఆస్పత్రి: చిత్తశుద్ధి, వృత్తి నిబద్ధతతో చేసిన సేవలే గుర్తింపు ఇస్తాయని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి అన్నారు. గాంధీ సెమినార్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి డిస్ట్రిక్ట్ ఫార్మసీ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన మధుసుధాకర్‌రెడ్డి వీడ్కోలు అభినందనసభ సందడిగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే సేవలను నిరుపేద రోగులు చిరకాలం గుర్తుంచుకుంటారని అన్నారు. అనంతరం పదోన్నతి వెళ్లిన మధుసుధాకర్‌రెడ్డి, గాంధీ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌రెడ్డిలకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, ఉస్మానియా ఆస్పత్రి ఆర్ఎంఓ–1 జయకృష్ణ, ఆర్ఎంఓలు రజనీ, సుధార్‌సింగ్, ఏడీ ఫ్లోరెన్స్‌మర్లిన్, ఏఓ హేమ, టీజీజీడీఏ గాంధీ యూనిట్ ప్రతినిధులు భూపేంద్రసింగ్‌రాథోడ్, కృపాల్‌సింగ్, తెలంగాణ ఫార్మసీ అసోషియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్‌లతో పాటు వైద్యులు, సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నాలుగు రోజులైనా లభించని దినేష్ ఆచూకీ



పార్శిగుట్ట చౌరస్తాలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: వినోభానగర్ నాలాలో దినేష్ కోసం వెతుకుతున్నామని చెబుతూ నాలుగు రోజులుగా హైడ్రా, జీహెచ్‌ఎంసీ బృందం నిర్లక్ష్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం దినేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పార్శిగుట్ట చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ముషీరాబాద్ వినోభానగర్‌లో దినేష్ అనే వ్యక్తి నాలాలో కొట్టుకుపోయాడన్నారు. నాలుగు రోజులు గడుస్తున్నా అతడి ఆచూకీ తెలుసుకోవడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. నగర మేయర్ విజయలక్ష్మి వెంటనే స్పందించాలన్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న ముషీరాబాద్ సర్కిల్ డీసీ రామానుజులరెడ్డి మాట్లాడారు దినేష్ కుటుంబానికి తాము అండగా ఉంటామని, అతడి కోసం గాలింపు చర్యలు మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. ఈ నిరసనలో నాయకులు శివప్రసాద్, రుద్రి, విజయ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడలోని ఆలుగడ్డ బావి బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో సుమారు 35–40 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తు తెలియని అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న లాలాగూడ పోలీసులు సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.



తెలంగాణ విమోచన దినోత్సవంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి



సనత్‌నగర్: ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ



టీజీపీసీబీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న సభ్య కార్యదర్శి రవి

విలీనం.. విమోచనం.. సమైక్యత

వివిధ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాల ఆవిష్కరణ
ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రజాపాలన దినోత్సవాలు

హైదరాబాద్ సంస్థానం దేశంలో భాగమైన రోజును రాజకీయ పార్టీలు ఘనంగా నిర్వహించాయి. సమైక్యతా దినోత్సవంగా బీఆర్‌ఎస్, విమోచన దినోత్సవంగా బీజేపీ, ప్రజాపాలన దినోత్సవంగా విలీన సంబరాలను కాంగ్రెస్ పార్టీ నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవానికి బీజేపీ శ్రేణులు భారీగా తరలాయి. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవంగా పాటిస్తూ ఆ పార్టీ నేతలు పలుచోట్ల జాతీయ జెండాలను ఎగురవేశారు. ప్రజా పాలన దినోత్సవంగా కాంగ్రెస్ శ్రేణులు మువ్వన్నెల పతాకాలను ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు.



సనత్‌నగర్: బేగంపేట స్వామి రామానందతీర్థలో జరిగిన జాతీయ సమైక్యత దినోత్సవంలో ఎమ్మెల్సీ వాణీదేవి, పీవీ ప్రభాకర్‌రావు తదితరులు



బొల్లారం: రాష్ట్రపతి నిలయంలో విమోచన దినోత్సవం



మధురానగర్‌లో విమోచన దినోత్సవ వేడుకలు



లాలాపేట ప్రభుత్వ పాఠశాలలో..

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర, హస్త కళా ప్రదర్శన



వినియోగదారులతో సందడిగా కళాసిల్క్ చేనేత వస్త్ర హస్త కళ ప్రదర్శన

సనత్‌నగర్: పద్మారావునగర్‌లోని కొత్త కామకోటి కల్యాణ నిలయంలో కళాసిల్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర, హస్త కళా ఉత్పత్తుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత కార్మికులు తయారు చేసిన చేనేత వస్త్రాలు, అన్ని రకాల కాటన్ వస్త్రాలు, దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తులు, హస్తకళా వస్తువులు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా నిర్వాహకులు వినోద్ తెలిపారు. దేశంలో అన్ని రకాల శుభకార్యాలకు సంబంధించిన వస్త్రాలు, ఇంటి గృహోపకరణాలు లభ్యమవుతాయని పేర్కొన్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి లభించడంతో పాటు వినియోగదారులకు తక్కువ ధరలకే ఉత్పత్తులు దొరుకుతాయన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతవాసులు వినియోగించుకోవాలని తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పరిధిలో ఎక్కడ సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి పరిష్కార చర్యలను ముమ్మరం చేస్తామని కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, రాజయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ప్రాముఖ్యతను చాటిచెబుదాం

మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు



కవులు, కళాకారుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

సనత్‌నగర్: బతుకమ్మ పండగ ప్రాముఖ్యతను, మహిళల ఐక్యతను, ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేసేలా కవులు, కళాకారులు, గాయకులు రచనలు, ప్రదర్శనలు చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. బుధవారం టూరిజం ప్లాజాలో కవులు, కళాకారులు, గేయ రచయితలు, గాయకులు, సాంస్కృతిక సలహా మండలి సభ్యులు తదితరులతో మంత్రి సమావేశమయ్యారు. అంబరాన్ని అంటేలా బతుకమ్మ సంబరాలు జరిపేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ క్రమంలో కవులు, కళాకారులు తమ రచనలు, కళారూపాల ద్వారా తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలను, బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను ముందు తరాలకు పరిచయం చేసేలా కృషి చేయాలన్నారు. బతుకమ్మ విశిష్టత, ప్రకృతిని పరిరక్షించేందుకు పువ్వులను పూజించే సంస్కృతి, గౌరమ్మ శక్తిని, మహిళల ఆశలను, ఆకాంక్షలను వివరించేలా పాటలు రాయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, ప్రముఖ దర్శకులు నర్సింగరావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, సాంస్కృతిక సలహా మండలి సభ్యులు, కవులు, కళాకారులు, జానపద గాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: పహాడి హనుమాన్ ఆలయాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌కే దక్కుతుందని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం అడ్డగుట్టలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో పహాడీ హనుమాన్ ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్నివిధాలుగా ఆలయాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కి దక్కుతుందని చెప్పుకొచ్చారు. పహాడి హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం 14 ఏళ్లుగా ఆలయ అభివృద్ధి, పరిరక్షణ కమిటీ ఎంతో కృషి చేసిందన్నారు. కొందరు కావాలని పహాడీ హనుమాన్ ఆలయంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అసత్య ప్రచారం చేస్తున్నారని, వారి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అభివృద్ధి కళ్ల ముందు కన్పిస్తుందన్నారు. ఈ సమావేశంలో పహాడీ హనుమాన్ ఆలయ అభివృద్ధి, పరిరక్షణ కమిటీ ప్రతినిధులు శ్రీరాములు, వెంకటేష్‌గౌడ్, నర్సింగ్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు మనోహర్, సత్తయ్యగౌడ్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహానికి బోర్డు మాజీ సభ్యుల లేఖ



వాజ్‌పేయి విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బోర్డు మాజీ సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వరరెడ్డి ఆరోపించారు. పికెట్ పార్కులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు తనతో పాటు బోర్డు మాజీ సభ్యులను ఆహ్వానించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన ముగిశాక మాజీ బోర్డు సభ్యులు పాండుయాదవ్, నళిని కిరణ్, అనిత ప్రభాకర్‌లతో కలిసి పికెట్ పార్కులోని వాజ్‌పేయి విగ్రహానికి లేఖ సమర్పించారు. కేంద్రం నుంచి కంటోన్మెంట్‌కు రావాల్సిన రూ.1000 కోట్ల సర్వీస్ చార్జీలు వచ్చేలా చూడాలని వాజ్‌పేయి విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి తమను ఎందుకు ఆహ్వానించకపోవడంపై బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. అంతకు ముందు రాజ్‌నాథ్ తిరుగు ప్రయాణంలో ఉండగా, పార్కు వెలుపల బోర్డు సభ్యులు నిరసన చేశారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం'

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డ మోడల్ మార్కెట్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మహిళా ఆరోగ్య సాధికారత చేకూర్చే దిశగా కేంద్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అక్టోబర్ 2 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు, ఆరోగ్యంపై అవగాహన, అవసరమైన వైద్య సేవలను అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంపై వైద్యులు దృష్టిసారించనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, సీనియర్ నేత విశాల్ సూదంలు హాజరై మహిళల ఆరోగ్య సంరక్షణకు మార్గనిర్దేశం చేశారు.

ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య ఎస్వీ మృతి

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు, ఆర్ట్స్ కళాశాల డీన్ ఆచార్య ఎస్వీ రామారావు బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు శాఖ అధ్యాపకులు, విద్యార్థులు ఎస్వీ రామారావు చిత్రపటం శ్రద్ధాంజలి వద్ద ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు శాఖలో సుదీర్ఘ కాలం పాటు ఆచార్యులుగా, ఆర్ట్స్ డీన్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. ఆయన మృతి తెలుగు శాఖకు, సాహిత్య అభిమానులకు తీరని లోటన్నారు. ఆయన రూపొందించిన తెలుగులో సాహిత్య విమర్శ పరిశోధన గ్రంథం నేటి పరిశోధకులకు, అధ్యాపకులకు, విద్యార్థులకు ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం, తెలుగు శాఖ అధ్యక్షులు కమలాకరశర్మ, డా. ఏలే విజయలక్ష్మి,ఎస్. రఘు, మహేందర్ తదితరులున్నారు.

పూలే గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్‌కి డాక్టరేట్



లాలాపేట: మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఏలే కిరణ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఓయూ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ పారిపల్లి శంకర్ పర్యవేక్షణలో ఏ- స్టడీ ఆన్ లెర్నింగ్ మ్యాథమెటిక్స్ ఎట్ సెకండరీ లెవెల్ ఇన్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ ఆఫ్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ కిరణ్‌కుమార్‌కు డాక్టరేట్‌ను అందజేసింది.

ఓయూలో 'స్పీక్ స్మార్ట్‌పై రెండు రోజుల ఉచిత శిక్షణ

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 'స్పీక్ స్మార్ట్ అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఓయూ హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ చరణ్, కోఆర్డీనేటర్ డా.యూ సూర్యవల్లి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల కమ్యూనికేషన్, ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా పోటీ ప్రపంచంలో అత్యాధునిక స్థానాన్ని పొందగలుగుతారని ఈ శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

న్యూమరీ సీట్ల వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదల

లాలాపేట: తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల ప్రవేశానికి టీజీ సీపీగెట్ ద్వారా సీపీపీ, ఎన్‌సీసీ, పీహెచ్ కేటగిరీల్లో సూపర్ న్యూమరీ సీట్ల భర్తీకై సర్టిఫికేట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసినట్లు టీజీ సీపీగెట్ కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ సర్టిఫికేట్ వేరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. ఓయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఈనెల 22 సోమవారం ఉదయం 9:30 గంటలకు అన్ని ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సులకు, ఇంటిగ్రేటెడ్ 5 ఏళ్ల కోర్సులకు సర్టిఫికెట్ వేరిఫికేషన్ ఉంటుందన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను చూడాలని సూచిస్తున్నారు.

సరుకులు అందజేత

బన్సీలాల్‌పేట్: డివిజన్‌లోని చాచానెహ్రూనగర్‌లో బుధవారం బీజేపీ నాయకులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని, విశ్వకర్మ జయంతి, తెలంగాణ విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ టి. రాజశేఖరరెడ్డి, నాయకులు వై. సురేశ్‌కుమార్, టీవీఎస్ రాజేశ్, శీలం శివకుమార్, బంధం కిరణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు లక్ష్మి, అండాలు, పరమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలా.. విలీనమా? తేల్చండి

రక్షణమంత్రికి ఎమ్మెల్యే లేఖ



రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారా? లేక బోర్డు ఎన్నికలు నిర్వహిస్తారా? ఏదో ఒకటి తేల్చండి అంటూ ఎమ్మెల్యే శ్రీగణేశ్, కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. పికెట్ పార్కులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ చేసిన అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేశ్, రాజ్‌నాథ్‌కు సింగ్‌కు లేఖ అందజేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం, పరిపాలన సౌలభ్యం కోసం కంటోన్మెంట్ బోర్డును జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని కోరారు. విలీనం ఆలస్యం అయితే కనీసం ఎన్నికలన్నా నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పరిపాలన మూలన పడిందని, ప్రజల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయన్నారు. ఈ సమస్యతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గంలో నివసిస్తున్న పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలని, పేద ప్రజలు నివసిస్తున్న భూములను బదలాయింపు చేసి ఆ భూములను ఫ్రీ హోల్డ్ చేయాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డుకు చెల్లించాల్సిన రూ.1000 కోట్ల ఆర్మీ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు.



ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న ఓయూ వీసీ ప్రొ. కుమార్

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

రాష్ట్ర ప్రభుత్వం పిలుపుతో బుధవారం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజాపాలన మొదలయ్యాక రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గాంధీ పాలన యంత్రాంగం



గాంధీ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



కస్తూర్బానగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: కస్తూర్బానగర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి కస్తూర్బానగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఏకరువు పెట్టారు. బస్తీ ప్రధాన రహదారిలో చెత్తా చెదారాన్ని సకాలంలో ఎత్తివేయడం లేదని, బస్తీలోని ఖాళీ స్థలంలో మట్టికుప్పలు, చెత్తాచెదారం వ్యర్థాలతో పాములు వస్తున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై అధికారులు సకాలంలో స్పందించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కస్తూర్బానగర్‌లో ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఖాళీ స్థలంలోని చెత్తాచెదారం వ్యర్థాలను తొలగించి మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ సుబ్రహ్మణ్యం, జలమండలి డీజీఎం ఆశీష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఉద్యానవన శాఖ అధికారిరెడ్డి, ఏఈ వెంకట్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.